క్లుప్తంగా

సూర్యక్షేత్రం సందర్శన



సూర్యక్షేత్రంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న ఈఈ జీకేడీ ప్రసాద్

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణ స్వామి క్షేత్రాన్ని ఆదివారం సూర్యాపేట మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీకేడీ ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. వారికి సూర్యక్షేత్ర విశిష్టతను క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు కాకులారపు జనార్దన స్వామి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

కోమటిరెడ్డిని విమర్శించే అర్హత కౌశిక్‌రెడ్డికి లేదు

నూతనకల్ : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై చేసిన ఆరోపణలు అర్థరహితమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కోమటిరెడ్డి పార్టీ మారడం కోసం బీఆర్‌ఎస్ అధినాయకత్వాన్ని సంప్రదించాడని కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. ప్రజలు ఓట్లు వేయకుంటే కుటుంబ సభ్యులమంతా ఆత్మహత్యకు పాల్పడతామని ఓటర్లను బెదిరించి గెలిచిన వ్యక్తి కౌశిక్‌రెడ్డి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం కృషి చేసిన కోమటిరెడ్డిని విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కళ్లెం కృష్ణారెడ్డి, జటంగి గణేష్, ఫజురుల్లా, అశోక్, చంద్రయ్య పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా సాయితేజ



అర్వపల్లి : జాతీయ మానవ హక్కులు, యాంటి కరప్షన్ అండ్ యాంటి బ్యూరో ఆఫ్ ఇండియా సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా జాజిరెడ్డిగూడేనికి చెందిన రింగు సాయితేజ నియమితులయ్యారు. ఆదివారం ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే.ఎస్. జ్యోతీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. సామాజిక సేవకు సంబంధించి అత్యుత్తమ పనితీరుకు ప్రతిస్పందనగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయితేజ మాట్లాడుతూ తనను నియమించిన జ్యోతీశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ



లక్ష్మాపురంలో ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు

నాగారం : వచ్చే నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో బీఎల్‌ఓలు ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓ మల్లేపాక కవిత, వెంకన్న, అంజయ్య, ముత్తయ్య, భిక్షం, శోభ, ధనమ్మ, సువర్ణ, సత్తయ్య, మల్లయ్య, రాములమ్మ, పద్మ, సుమలత, అనసూర్య, భద్రమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేడే పోస్టర్ల ఆవిష్కరణ



నూతనకల్‌లో మేడే ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హమాలీ సంఘం నాయకులు

నూతనకల్ : ప్రపంచ మేడే ఉత్సవాలను కార్మికులు వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు మూరగుండ్ల మధు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మేడే ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ హక్కుల సాధన కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరులను గుర్తుంచుకోవడంతో పాటు కార్మిక ప్రయోజనాల కోసం మేడే ఉత్సవాలను నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా శ్రామిక హమాలీ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు మరికంటి సైదులు, నకిరేకంటి వెంకన్న, శ్రీను, మూరగుండ్ల వెంకన్న, సురేష్, మనోజ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నడిగూడెం : వచ్చే నెల 13న జగరనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలో పలు చోట్ల వాహనాలను నడిగూడెం పోలీసులు ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా నడిగూడెం మీదుగా వచ్చి వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు

- ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాని వైనం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



నసీంపేటలో పిల్లర్ల దశలోనే ఉన్న ఎస్సీ కమ్యూనిటీహాల్ (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్) : గ్రామాల్లో చిన్నచిన్న సభలు, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు మండల వ్యాప్తంగా 2017 నుంచి ఎస్సీ కమ్యూనిటీ హాళ్లను మంజూరు చేసింది అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం. కానీ 7, 8 సంవత్సరాలు దాటినా నేటికీ పూర్తి కాకపోవడంతోపాటు వినియోగంలోకి రాలేదు. కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్ని చోట్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇంతవరకు పనులే ప్రారంభం కాలేదు. దీంతో ఎస్సీలపై ప్రేమ వ్యక్తం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం కమిటీ హాళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మండల పరిధిలోని గ్రామాల్లో ఇలా..

ఆత్మకూరు మండల వ్యాప్తంగా 19 పాత గ్రామ పంచాయతీలలో ఎస్సీ కమిటీలను మొదటిసారి ఎన్నికైన తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా పాత సూర్యాపేటలో రూ.7.50 లక్షలు, ఏనుబాములలో రూ.25 లక్షలు, ఇస్తాళాపురంలో రూ.7.50 లక్షలు, రామన్నగూడెంలో రూ.7.50 లక్షలు, ఏపూరులో రూ.25 లక్షలు, బొప్పారంలో రూ.7.50లక్షలు, మక్తా కొత్తగూడెంలో రూ.7.5 లక్షలు, మిడతనపల్లిలో రూ.7.5 లక్షలు, దాచారంలో రూ.7.5 లక్షలతో నిర్మాణాలు పూర్తి కాగా పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు. అదే విధంగా కందగట్లలో రూ.20 లక్షలు, ఆత్మకూరులో రూ.50 లక్షలు, శెట్టి గూడెంలో రూ.25 లక్షలు, కోటపహాడ్‌లో ఏడున్నర లక్షలు మంజూరు కాగా పనులు ఇంకా పూర్తిస్థాయిలో కాకపోవడంతో భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. అదేవిధంగా గట్టికల్‌కు రూ.7.5 లక్షలు, పాతర్లపహాడ్‌కు రూ.25 లక్షలు, ముక్కుడుదేవులపల్లికి రూ.25 లక్షలు, తుమ్మలపెన్‌పహాడ్‌కు రూ.25 లక్షలు, నసీంపేటకు రూ.7.5 లక్షలు మంజూరు కాగా ఈ గ్రామాల్లో పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. ముక్కుడుదేవులపల్లిలో నేటికీ స్థల సేకరణ పూర్తి కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి

మండలంలో మంజూరైన ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వమైనా ఎస్సీలపై చిన్నచూపు చూడకుండా ఈ భవన నిర్మాణాలను పూర్తి చేయించాలి. నిధులు మంజూరైన ప్రతిచోట వినియోగంలోకి వచ్చేలా చూడాలి.

- బొడ్డు మల్సూర్ మాదిగ, టీఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు

బొమ్మగాని వెంకటయ్యకు నివాళి



బొమ్మగాని వెంకటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

దురాజ్‌పల్లి : తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమంలో బొమ్మగాని వెంకటయ్య పాత్ర కీలకమైందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ జాతీయ నాయకుడు బొమ్మగాని వెంకటయ్య ప్రథమ వర్ధంతిని ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. సూర్యాపేట కేంద్రంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో బొమ్మగాని ధర్మభిక్షం అడుగు జాడల్లో నడిచిన వ్యక్తి వెంకటయ్య అన్నారు. వెంకటయ్య మరణించే వరకు ఉద్యమాలే ఊపిరిగా పని చేశాడని గుర్తు చేశారు. అంతేకాకుండా కుటుంబ సభ్యులను కూడా ఉద్యమంలో భాగస్వాములను చేశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోదా శ్రీరాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కేపీఎల్, మల్లేశ్వరి, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, రాంబాబు, దోరెపల్లి శంకర్, అశోక్‌కుమార్, నాగభూషణం, బొమ్మగాని శ్రీనివాస్, బూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు



కొమ్మాల గ్రామంలో టెంట్ నీడలో సేద తీరుతున్న ఉపాధి హామీ కూలీలు



కోమటిపల్లిలో షేడ్ నెట్ కింద..

- పని ప్రదేశంలో తాగునీరు, టెంట్ల ఏర్పాటు
- జిల్లాలో మూడో స్థానంలో జాజిరెడ్డిగూడెం మండలం

అర్వపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తున్న కూలీలకు తగు వసతులు కల్పిస్తున్నారు. ఎండల దృష్ట్యా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో తాగునీరు, నీడకోసం టెంట్లు, షేడ్ నెట్లు ఏర్పాటు చేస్తున్నారు. కాగా ఎక్కువ కూలీలు వెళ్తున్న మండలాల్లో జాజిరెడ్డిగూడెం మండలం జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. ఈ మండలంలో అత్యధికంగా రోజుకు 3,250 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. ప్రస్తుతం జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా 41 పనులు జరుగుతున్నాయి.

గ్రామాల వారీగా వసతుల కల్పన..

మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో గత నాలుగురోజుల నుంచి కూలీలకు తాగునీరు, నీడవసతి కల్పిస్తున్నారు. గ్రామ పంచాయతీల సిబ్బంది ప్రతిరోజు పని ప్రదేశాలకు తాగునీరు తీసుకెళ్తున్నారు. పని ప్రదేశాలలో టెంట్లు లేదా షేడ్ నెట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఎండల సమయంలో కూలీలు వీటికింద సేద తీరుతున్నారు. దీంతో వారికి కొంత ఉపశమనం కలుగుతోంది. ఇప్పటివరకు ఉపాధి పనులకు వెళ్లే కూలీలు చెట్ల కింద కూర్చొని సేద తీరేవారు. చెట్లు లేని ప్రాంతాల్లో ఎండలోనే కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు రోజుల నుంచి వసతులు కల్పిస్తుండడంతో కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నీరు, నీడ వసతి కల్పిస్తున్నారు



ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు కల్పిస్తున్నారు. మూడు రోజుల నుంచి గ్రామ పంచాయతీ వారు తాగు నీటిని తెస్తున్నారు. అలాగే నీడ కోసం షేడ్‌నెట్లు వేస్తున్నారు. వీటి వల్ల ఎండ నుంచి కొంత ఉపశమనం కలుగుతోంది.

- గడ్డం పరశురాములు, ఉపాధి కూలీ, సీతారాంపురం

వసతులు కల్పిస్తున్నాం



కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు తాగునీరు, నీడవసతి కల్పిస్తున్నాం. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఈ వసతులు కల్పించడం జరుగుతోంది. ఈ అవకాశాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలి.

- డి.సందీప్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

బీజేపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం



తిరుమలగిరి : మాలిపురంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



నాగారంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కడియం రామచంద్రయ్య

తిరుమలగిరి : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వై.దీన్‌దయాళ్ కోరారు. ఆదివారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురంలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మూడవసారి ప్రధాని కావాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలందరికీ ఉచితంగా బియ్యం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, మూల వెంకన్న, సోమయ్య, వీరస్వామి, వంగరి వెంకన్న, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య కోరారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మొల్కపురి చిరంజీవి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, కూర మల్సూర్, వంగూరి మహేష్, గారబోయిన రమేష్, యాదగిరిగౌడ్, బొబ్బలి కిరణ్, సోమేష్, బొబ్బలి భార్గవ్, పచ్చిపాల శంకర్, సోముల యాకుబ్, మంగదుడ్ల శివ, గణేష్ పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

నాగారం : పార్లమెంట్ ఎన్నికల్లో ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) భువనగిరి అభ్యర్థి కొంగరి లింగస్వామిని ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ నాయకుడు డి.విజయరామరాజు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అగ్రకుల పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై బహుజనుల కోసం పోరాడే ధర్మ సమాజ్ పార్టీ చెప్పుల గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. డీఎస్పీ అభ్యర్థులను గెలిపిస్తే దేశంలో బీసీ రిజర్వేషన్లు, మహిళల ఉప కోట బిల్లులు, ఉచిత విద్య, వైద్యం కోసం పార్లమెంట్‌లో గళమెత్తుతామన్నారు. భువనగిరి డీఎస్పీ అభ్యర్థి కొంగరి లింగస్వామి చెప్పుల గుర్తుకు ప్రజలు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు డీఎస్పీ నాయకులు చిప్పలపల్లి నాగార్జున, మల్లేపాక భాస్కర్, పేరాల శ్రీనివాస్, వినిత్ ఉన్నారు.

మతతత్వ బీజేపీకి ఓటమి తప్పదు

మునగాల : మతతత్వ బీజేపీకి ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి తప్పదని సీపీఎం సీనియర్ నాయకుడు బుర్రి శ్రీరాములు అన్నారు. ఆదివారం మండలంలోని నేలమర్రిలో బచ్చలకూరి రాందాసు అధ్యక్షతన జరిగిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రైతులకు వ్యతిరేకంగా మూడు నల్లచట్టాలను తెచ్చిందన్నారు. రైతులు 13నెలల పాటు చేసిన పోరాటం ఫలితంగా ఆ చట్టాలను వెనుకకు తీసుకుందని తెలిపారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సంపన్నులకు రాయితీలు ఇస్తూ ప్రజలపై అనేక భారాలను మోపుతుందని అన్నారు. సమావేశంలో నాయకులు చందా చంద్రయ్య, బచ్చలకూరి రామ్‌చరణ్, బచ్చలకూరి స్వరాజ్యం, మండవ వెంకటాద్రి, మామిడి గోపయ్య, బట్టుపల్లి ఉపేందర్, జీడయ్య, కోటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరాములు

60శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి



అర్వపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం



కాంటా అయిన ధాన్యం బస్తాలను లారీలో లోడు చేస్తున్న హమాలీలు

- 20 కేంద్రాల ద్వారా 1,24,055 క్వింటాళ్ల ధాన్యం సేకరణ
- రైతులకు ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపు
- ధాన్యం ఎగుమతికి లారీలను పెంచాలని రైతుల వినతి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ 60 శాతం పూర్తయింది. ఈసీజన్‌లో రైతులనుంచి ధాన్యం కొనుగోలుకు మండల వ్యాప్తంగా 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సెర్ప్ ఆధ్వర్యంలో 16 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 2 కేంద్రాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో 2 కేంద్రాల చొప్పున ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఇప్పటివరకు 60 శాతం పూర్తయింది.

జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా..

జాజిరెడ్డిగూడెం మండలం వ్యాప్తంగా ఇప్పటివరకు 20 కేంద్రాల ద్వారా1,24,055 క్వింటాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 1,780 మంది రైతులు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించారు. ధాన్యం విక్రయించిన రైతులకు బిల్లులు కూడా ఎప్పటికప్పుడు చెల్లింపు అవుతున్నాయి. ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్ లత, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు పర్యవేక్షిస్తున్నారు. మండల స్థాయిలో నోడల్ అధికారి శ్రీనివాసులు, ఏఓ శశిధర్‌రెడ్డి, ఏపీఎం మల్లేష్‌లు ప్రతిరోజు కేంద్రాలను సందర్శిస్తూ కొనుగోళ్లను, ఎగుమతులను పరిశీలిస్తున్నారు.

ధాన్యం బిల్లు వచ్చింది



మా గ్రామంలోని సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో 92 క్వింటాల ధాన్యాన్ని అమ్ముకున్నాను. అయితే ధాన్యం బిల్లు రూ.2,02,676 నా బ్యాంకు ఖాతాలో జమ అయింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని అమ్ముకున్నాను.

- ఖమ్మంపాటి భద్రమ్మ, రైతు, వేల్పుచర్ల

కొనుగోళ్లు వేగవంతం చేశాం



మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశాం. 20 కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సుమారు 1,24,055 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో మాట్లాడుతూ ధాన్యం ఎగుమతికి లారీల కొరత లేకుండా చూస్తున్నాం.

- జక్కర్తి శ్రీనివాసులు, తహసీల్దార్, మండల నోడల్ అధికారి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

చివ్వెంల : మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2002–03 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రిష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, సుందర్‌రావు, శ్రీనివాస్, యాదయ్య, తబిత, పుష్ప, దేవయ్య, మల్సూర్, సురేష్ రెడ్డిలతో పాటు పూర్వ విద్యార్థులు అనంతుల మధు, సిద్దోజు రమేష్, వట్టికూటి సైదులు, బోడపట్ల మధు, గోపి, విజయ, భాగ్య, రేఖ, సరిత, రవీందర్, అంజి, కిశోర్, నాగరాజు, భీమ్లా, మురళి, జ్యోతి, ఝాన్సీ, సుందరయ్య, భాస్కర్, శోభన్, హుస్సేన్, రాజా పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



తిరుమలగిరి : వెలిశాలలో ఆర్థికసాయం అందజేస్తున్న ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న



అర్వపల్లి : అడివెంలలో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి : వెలిశాల గ్రామానికి చెందిన ఆలకుంట్ల శ్రీను ఇటీవల మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులకు ఏపూరి ఫౌండేషన్ అధినేత, ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న ఆదివారం రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏపూరి ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గ ప్రజలకు సహాయ, సహకారాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలకుంట్ల కృష్ణ, లింగన్న, వెంకన్న, గిలకత్తుల రమేష్, ఏపూరి యాకన్న, మధు, జగదీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి కుటుంబానికి..

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏడెల్లి సాయిలు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. దీంతో కాంగ్రెస్ నాయకులు బీరవోలు విక్రంరెడ్డి, మందుల సూర్యకిరణ్, తిమ్మాపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి ఆదివారం మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. 5 వేల ఆర్థికసాయం, క్వింటా బియ్యం అందజేశారు. మృతుడి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి మధూకర్‌రెడ్డి, బైరబోయిన మహరాజు, గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల సైదులు, కొమ్మనబోయిన వెంకన్న, బోయపల్లి రవి, మేడెబోయిన ప్రవీణ్, అజయ్, శతకోటి విద్యాసాగర్, మారిపెద్ది వెంకన్న, ఎండీ. లతీఫ్, దోమల సైదులు పాల్గొన్నారు.

జహంగీర్‌ను గెలిపించాలి

నూతనకల్ : ప్రజా సమస్యలపై నిరంతరం పాలక పక్షాలపై పోరాడి ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతుకైన జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం మండల పరిధిలోని యడవెల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మిక, కర్షకులను అన్ని విధాలుగా వంచించిన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన కోరారు. చిన్ననాటి నుంచే ప్రజాసమస్యలపై అవగాహన పెంచుకొని, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న వ్యక్తి జహంగీర్ అని తెలిపారు. జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, దండా వెంకట్‌రెడ్డి, గాజుల జానయ్య, ఎల్లయ్య, లింగయ్య, లక్ష్మమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం



సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి : ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. ఆదివారం మండల పరిధిలోని సంగెం, కొత్తగూడెం గ్రామాల్లో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అబద్ధాల వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పే విధంగా ప్రజలు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామా మల్లేష్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. వచ్చే నెల 1వ తేదీన జరిగే పార్టీ మండల జనరల్ బాడీ సమావేశాన్ని, 3వ తేదీన తుంగతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామా మల్లేష్ రోడ్‌షో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పూన్య రవినాయక్, రాములు, రవి, కరుణాకర్, ఉప్పలయ్య, నిరంజన్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలో మాదిగ కులస్తుల ఆరాధ్య దైవమైన సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాషబోయిన భాస్కర్‌రావు వారి తల్లిదండ్రులు జానకిరామయ్య, అనసూర్యమ్మల జ్ఞాపకార్థం రూ.2లక్షలను విరాళంగా అందజేశారు. తాజా మాజీసర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు ముత్యాలమ్మ ఆలయ నిర్మాణం చేయించనున్నారు. ఆదివారం ఆ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ గ్రామంలో నిర్మించే ఆలయ అభివృద్ధికి తమవంతుగా సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో మాదిగ కులపెద్దలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



జాజిరెడ్డిగూడెంలోని కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏపీఎం మల్లేష్

అర్వపల్లి : మండల పరిధిలోని జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, రామన్నగూడెం, కుంచమర్తి తదితర గ్రామాల్లో సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఏపీఎం వలిశెట్టి మల్లేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. రైతుల సీరియల్ ప్రకారం ధాన్యం కాంటాలు వేయాలని నిర్వాహకులకు సూచించారు. కాంటాలైన ధాన్యం బస్తాలను వెంటవెంటనే మిల్లులకు ఎగుమతి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

కోదాడరూరల్ : విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండలంలోని రామలక్ష్మీపురానికి చెందిన అన్నెం నరసింహారెడ్డి స్రవంతి దంపతులు అన్నారు. ఆదివారం ఇంటర్‌లో ప్రతిభ చూపిన గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులకు స్థానిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాభవిష్యత్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. వారి తల్లిదండ్రులను సన్మానించి మాట్లాడారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఐఐటీ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు పొందాలని వారు ఆకాంక్షించారు. చదువుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు తమ ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అన్నెం పాపిరెడ్డి, ఉపాధ్యాయులు బడుగుల సైదులు, లెక్చరర్ బుడిగ వీరబాబు, భాస్కర్, జ్యోతి, బాలనాగిరెడ్డి, నరసింహారెడ్డి, వీరనాగిరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.